క్లుప్తంగా

ఉపాధ్యాయినులకు పురస్కారాలు



తెనాలిఅర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లీడ్‌స్కూల్ విధానమని ఆ సంస్థ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ బి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. లీడ్‌స్కూల్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 14 మంది ఉపాధ్యాయినులకు జాతీయ పురస్కారాలను సోమవారం బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మూడువేలకు పైగా పాఠశాలలు లీడ్ స్కూల్ విధానాన్ని అవలంబిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, లీడ్ స్కూల్ జిల్లా అకాడమీ మేనేజర్ బి.వి.సుధాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల గ్రామం నందివెలుగులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్టా రాజ్యలక్ష్మి(45) తన ఎలక్ట్రిక్ స్కూటర్‌పై నందివెలుగు జంక్షన్ వైపు వెళుతుండగా ఎదురుగా వచ్చిన ట్రక్కు ఆటో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

కోదండరామునిగా నృసింహస్వామి



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి కోదండరామునిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఓటు హక్కు వినియోగంపై వినూత్న ప్రచారం

- ఎడ్లబండ్లతో పట్టణంలో ప్రదర్శనగా అధికారులు
- జెండా ఊపి ప్రారంభించి, పాల్గొన్న సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ విభాగాల సహకారంతో చేపడుతున్న ఓటరు అవగాహన (స్వీప్) కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పట్టణంలో వినూత్నంగా ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ బండి శేషన్నతో కలిసి ఎడ్లబండిపై నిలబడి ర్యాలీలో కొనసాగారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు రైతు వేషధారణలో పాల్గొనటం మరో విశేషం. ఎడ్లబండ్లపై కూర్చొని ర్యాలీలో పాల్గొన్న వారు ఓటు ప్రాధాన్యతపై ప్లకార్డులు ధరించారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో 77 శాతం పోలింగ్ జరిగిందని చెప్పారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో 80 శాతంపైగా పోలింగ్ జరగాలనే లక్ష్యంతో వివిధ రీతుల్లో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదైన వారితో సహా ఓటు హక్కు కలిగిన వారు పోలింగ్ రోజున ఓటు వేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. పోలింగ్ శాతం కచ్చితంగా పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, పట్టణ ప్రణాళిక విభాగం సహాయ అధికారులు జెడ్.సుధాకర్, సుబ్బారావు, వన్‌టౌన్ సీఐ దశరధరామారావు, రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల ర్యాలీలో కమిషనర్ శేషన్న, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్



ప్లకార్డులతో ఎడ్లబండిపై మహిళలు



రైతు వేషధారణలో మున్సిపల్ అధికారి

దోమల నియంత్రణలో భాగస్వాములు కావాలి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు తీసుకునే చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల కోరారు. ఐతానగర్‌లోని జయప్రకాష్‌నగర్‌లో సోమవారం మలేరియా, ఫైలేరియా సిబ్బంది నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న మురుగుకాల్వలు, కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరుగుతుందని చెప్పారు. దోమ కాటువలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అందరూ డ్రై డేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాత వస్తువులను శుభ్రం చేసుకోవాలని, అలాగే నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సిబ్బంది దాసరి మల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయండి



మురుగు కాల్వలు పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేసే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 27వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు, మురుగు కాల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నెలాఖరు వరకు పన్ను రాయితీ వర్తింపు

మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు చెల్లించి ఐదు శాతం రాయితీ పొందవచ్చని కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. నగరంలోని ప్రతి సచివాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు పన్ను చెల్లించే అవకాశం ఉందని చెప్పారు.

రాగద్వేషాలు లేకుండా సంక్షేమం అందించాం

- అగ్రకులాల్లోని పేదలకూ సంక్షేమం అందించాను
- తెనాలిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నా
- ఎవరు ప్రేమగా పిలిచినా బాధ్యతగా వెళ్లాను
- కాపు సంఘీయుల సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రజలు తనపై నమ్మకముంచి ఇచ్చిన అవకాశంతో అయిదేళ్లుగా నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేశానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వ ప్రాధాన్యతల ప్రకారం సంక్షేమాన్ని గరిష్టంగా అందజేశానని ఎలాంటి రాగద్వేషాలు చూపలేదని, కులమతాలు, పార్టీల వివక్ష జోలికి పోలేదని స్పష్టం చేశారు. స్థానిక రామలింగేశ్వరపేటలో ఆదివారం రాత్రి కాపు సంఘీయులతో ఏర్పాటైన సమావేశానికి కఠారి హరీష్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో గల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1800 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమచేసినట్టు చెప్పారు. జగన్ ప్రభుత్వం తొలిసారిగా అగ్రవర్ణాల్లోని పేదలకూ సంక్షేమం అందించినట్టు గుర్తు చేశారు. కాపు నేస్తం కింద ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తుండగా, ఇతర అగ్రకులాల్లోని పేదలకు ఈబీసీ నేస్తం కింద ఆర్థిక సాయం అందిస్తోందని తెలియజేశారు. గత ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటు వేసినవారికీ సంక్షేమ లబ్ధిని కల్పించామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను నియమించి, వారు చెప్పిన వారికే పనులు చేశాయని గుర్తు చేశారు. తాము అలా చేయలేదని అర్హత కలిగిన అందరికీ లబ్ధి చేకూర్చామని స్పష్టం చేశారు. ఏ పార్టీకి ఓటు వేసినా మంచి చేయగలిగితే వచ్చేసారి ఆదరిస్తారనేది తమ నమ్మకమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతి ఇంటినీ సందర్శించి, ఆ ఇంటికి ఇచ్చిన సంక్షేమాన్ని తెలియజేశానని అన్నారు. అప్పుడు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలనూ పరిష్కరించామని చెప్పారు. పట్టణంలో 160 రోడ్లను నిర్మించినట్టు తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్రతి వార్డును అభివృద్ధి చేస్తూ వచ్చానని, అందుకే మరోసారి ఎన్నికల్లో పోటీకి సీఎం జగన్ అవకాశం కల్పించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. అసెంబ్లీకి పోటీచేస్తున్న తనను, నాదెండ్ల మనోహర్‌ను పోల్చి చూసుకోవాలని సూచించారు. ఓడినా, గెలిచినా తాను ఇక్కడే ప్రజలకు అందుబాటులో ఉంటున్నాననీ, హైదరాబాద్‌కో లేక అమెరికాకో వెళ్లలేదన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు కూరగాయలు, నిత్యావసరాలు అందిస్తూ, బాధితులకు వైద్యసేవలు సక్రమంగా అందేలా చూశానని గుర్తు చేశారు. వినాయక విగ్రహాలకు జనసేన పార్టీ వాళ్లు పిలిచినా అభిమానంతో వెళ్లానని చెప్పారు. నా నడక, నడత ఇప్పుడెలా ఉందో... భవిష్యత్‌లోనూ అలాగే ఉంటుందన్నారు. మళ్లీ రెండోసారి ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో గోపాలం శివనాగేశ్వరరావు, మండి సాంబశివరావు, కళ్యాణ వెంకట్రావు, అంబటి నాగేశ్వరరావు, బచ్చు రాఘవరావు, బత్తుల శ్రీను, రాయపూడి కృష్ణ, యంద్రపాటి శ్రీనివాస్, గుత్తికొండ ఉమామహేశ్వరరావు, కోడూరు శివయ్య, దూదిబండ్ల సాయి, ముత్యంశెట్టి కొండయ్య, గుండు బాలాజీ, ఐనంపూడి చంద్రశేఖర్, రాయపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

జగన్‌కు మరోసారి పట్టం కట్టండి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డులో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమావత్ కవితాభాయ్, యాతాటి అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమావత్ శ్రీను నాయక్, యలవర్తి సాంబశివరావు, శ్యామంపూడి రఘురామిరెడ్డి, మల్లిబోయిన రాము, కఠారి హరీష్, కాకి దేవసహాయం, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ సతీమణి పుష్ప

నందివెలుగులో కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: తెనాలిరూరల్ మండలం నందివెలుగు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన ఎన్నికల ప్రచారం సోమవారం నాల్గవరోజు జరిగింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, సొసైటీ చైర్‌పర్సన్ తోటకూర వసంతరావు, పార్టీ గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి అనిల్‌కుమార్, పార్టీ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, సోమరాజు విజయలక్ష్మి, వేముల మహేష్, బెజ్జం బాజీ, కసుకుర్తి దానియేలు, గొర్రె వెంకటేశ్వరరావు, నవనీతం నాగేశ్వరరావు, బత్తుల బాల గోపి, మంగా చిట్టిబాబు, శాంతిరాజు, కమాదుల స్వామి, షేక్ చినగాలీషా పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తనయుడు సత్యనారాయణ

ఓటు హక్కుపై అవగాహన



తెనాలి: కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. స్థానిక శ్రీచైతన్య జూనియర్ కాలేజిలో సోమవారం కౌన్సిల్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పల్నాటి నాగరాజు మాట్లాడుతూ సామాన్యులకు ఓటు హక్కు వజ్రాయుధమని చెప్పారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ఉందని, అందరికీ ఓటు, ఎన్నికలు, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. గత నెలలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు శ్రీచైతన్య జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్ సర్టిఫికెట్లను అందజేశారు. బోర్డ్ ప్రిన్సిపాల్ మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గోవర్ధనస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పండగ సందర్భంగా మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి వైఖానస పండిట్ బీఎల్ఎన్‌డీ భట్టాచార్యులచే పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పంచాంగ శ్రవణానికి ముందుగా సంగీత జగద్గురు సేవాసమితి ఆధ్వర్యంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ ఉంటుందన్నారు. గుంటూరుకు చెందిన గోవాడ పవన్‌కుమార్ పేరిట ఆయన కుమారులు గోవాడ చక్రవర్తి, ప్రవీణ్ చక్రవర్తి, వారి కుటుంబసభ్యులు ఈ సంగీత కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

నేటి నుంచి విజయకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో 17వ తేదీ వరకు క్రోధి నామ సంవత్సర వసంత నవరాత్రోత్సవములు నిర్వహించనున్నామని చెప్పారు. ఉగాది పండుగ సందర్భంగా ఉదయం 8 గంటలకు అభిషేక మహోత్సవం, 11 గంటలకుక్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం, 17వ తేది బుధవారం ఉదయం 9.30 గంటలకు శ్రీ సీతారామచంద్రులకు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా ఉగాది సంబరాలు



షేక్ అస్మతున్నీసాకు కాంస్య నంది, సాహితీ విద్యారత్న బిరుదుతో సత్కారం



బెల్లంకొండ వెంకట్‌కు 'కళాభూషణ్' బిరుదు ప్రదానం

తెనాలి: పద్మభూషణ్ గుర్రం జాషువా కళాసమితి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో ఆదివారం రాత్రి పొద్దుపోయేంత వరకు ఈ వేడుకలు జరిగాయి. వివిధ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరంర వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. స్థానిక ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు తెలుగు ఉపాధ్యాయిని, కవయిత్రి డాక్టర్ షేక్ అస్మతున్నీసాకు ఉగాది పురస్కారంగా కాంస్య నంది, సాహితీ విద్యారత్న బిరుదు బహూకరించారు. ఇదే వేదికపై ప్రముఖ చిత్రకారుడు, కళాకారుడు డాక్టర్ బెల్లంకొండ వెంకట్‌కు 'కళాభూషణ్' బిరుదుతో ఉగాది పురస్కారం జేశారు. పద్మభూషణ్ గుర్రం జాషువా కళాసమితి జాతీయ చైర్మన్ పెద్దేటి యోహాను ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డాక్టర్ రంగిశెట్టి రమేష్, పలువురు ఉపాధ్యాయులు, కళాకారులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో దుర్గామాత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజయదుర్గా మాత ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మూడో రోజు సోమవారం ఉదయాన్నే ఆలయ అర్చకులు వి.రాజేంద్రశర్మ అమ్మకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు చేశారు. మూడు రోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్న గణపతి, చండీహోమాలు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మను మల్లెపూలతో విశేషంగా అలంకరించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వి.శివయ్య, సభ్యులు టి.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, బి.ఏడుకొండలు, జి.వెంకయ్య, టి.నరసింహారావు, డి.దుర్గారావు, వి. చిన్నవెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.